క్లుప్తంగా

రైతు సమావేశాలు నిర్వహించాలి



కామారెడ్డి అర్బన్: భారతీయ కిసాన్ సంఘ్ కామారెడ్డి మండల సమావేశం ఆదివారం టీక్రియాల్ ఫంక్షన్ హాల్‌లో అధ్యక్షుడు కొమిరెడ్డి చిన్నఅంజన్న అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా బీకేఎస్ క్షేత్ర సంఘటన మంత్రి దోనూరి రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబీర్ ఆనందరావు, ఉపాధ్యక్షులు గని నగేష్, రాష్ట్ర కార్యదర్శి కొమిరెడ్డి అంజన్న, జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, కార్యదర్శి అర్ల శంకర్‌రావులు హాజరై మాట్లాడారు. రైతుల వివిధ సమస్యలపై చర్చించారు. తమ అనుభవాలను వివరించే ఇలాంటి కార్యక్రమాలు అన్ని మండలాల్లో నిర్వహించాలని రైతులు కోరారు.

గిడుగు పురస్కారం పొందిన కాసర్ల రామచంద్రం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన ప్రముఖ కవి, రచయత కాసర్ల రామచంద్రం కరీంనగర్‌కు చెందిన తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ గిడుగు రామమూర్తి పురస్కారం అందుకున్నారు. కరీంనగర్ ఫిలిం భవన్‌లో శనివారం రాత్రి నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో కాసర్ల రామచంద్రం గిడుగు రామమూర్తి పురస్కారం పొందారు. రామచంద్రం గిడుగు పురస్కారం పొందడంతో తెలంగాణ రచయితల సంఘం ప్రతినిధులు పలువురు అభినందించారు.

పేదలకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి




భిక్కనూరు: ఖాళీస్థలం ఇళ్లు లేని నిరుపేదలందరికి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన భిక్కనూరులో నాల్గు వార్డుల్లో పర్యటించి ఖాళీస్థలం, ఇళ్లు లేనివారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు కుమ్మక్కై ప్రస్తుతం ఉన్న డబుల్ బెడ్‌రూమ్‌లను కొందరూ అనర్హులకు కూడా కేటాయింపజేశారని ఆరోపించారు.జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి విచారణ నిర్వహించి అనర్హులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూములను రద్దు చేయాలన్నారు. వ్యవసాయకార్మిక సంఘం నేతలు హైమది, చంద్రకళ, లక్ష్మి, భూమేష్,హరి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్‌పై శివశంకర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి



కామారెడ్డి అర్బన్: కేంద్ర మాజీ న్యాయశాఖ మంత్రి పుంజాల శివశంకర్ జయంతిని ఆదివారం మున్నూరుకాపు సంఘ భవనంలో నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. శివశంకర్ కాంస్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య, కామారెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త నీలం నర్సింలు, ప్రతినిధులు లక్ష్మిగారి వేణు, రాజేందర్, పాశం మహేష్, మామిండ్ల రమేష్, మామిండ్ల లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవాలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైశ్యభవన్‌లో వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు వినోద్, నవీన్, తులసి తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా బీటీ రోడ్డు

- మర్కల్-తిర్మన్‌పల్లి మార్గంలో వాహనదారులకు తప్పని ఇబ్బందులు
- వరినాటు వేసి నిరసన తెలిపిన మర్కల్ గ్రామస్తులు
- మరమ్మతులు చేయించాలని గ్రామస్తుల డిమాండ్



గుంతల్లో వరి నాటు వేసి నిరసన తెలుపుతున్న మర్కల్ గ్రామస్తులు



గుంతలమయంగా మారిన మర్కల్ బీటీ రోడ్డు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్-తిర్మన్‌పల్లి గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలను తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలమయంగా మారిన ఈ బీటీ రోడ్డుపై ఓవర్ లోడ్‌తో కూడిన మొరం టిప్పర్లు, లారీలు వెళ్తుండడంతో గుంతలు మరింత ప్రమాదకరంగా మారాయి. రోడ్డు గుండా వ్యవసాయ బావులకు వెళ్లే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డు గుండా ఓవర్ లోడ్‌తో వాహనాలు తీసుకురావద్దని వారించిన వినడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా ప్యాచ్ వర్కులు...

44వ జాతీయ రహదారి నుంచి సుమారు అర కిలోమీటర్ దాక బీటీని రెన్యూవల్ చేసి వదిలేశారు. రోడ్డుకు మరమ్మతులకు నిధులు మంజూరు అయినప్పుడల్లా నామమాత్రంగా గుంతలను పూడ్చి మమ అనిపిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్యాచ్‌లు చేసిన కొద్ది రోజుల్లోనే మళ్లీ గుంతలు పడడంతో ఇబ్బందులు తప్పడం లేదు...

నాటు వేసి నిరసన...

అధికారులకు రోడ్డు సమస్యలను, రోడ్డు వెంబడి భారీ లోడ్‌తో రాకపోకలు సాగిస్తున్న టిప్పర్ల గురించి పలు మార్లు విన్నవించిన పట్టించుకోకపోవడంతో బీటీ రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో నాటు వేసి నిరసన తెలిపారు. ఇప్పటికైన అధికారులు దృష్టి సారించి బీటీ రోడ్డును బాగు చేయించాలని మర్కల్-తిర్మన్‌పల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులకు మస్తు సార్లు చెప్పినం



రోడ్డును బాగు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదు. చాలా ఇబ్బంది అవుతుంది. మా రోడ్డు బాధను ఎవరికి చెప్పిన ఫలితం లేకుండా పోతుంది. ప్రస్తుతం రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డును బాగు చేయించాలి.

–దోకూరి రాజిరెడ్డి, మర్కల్

అంబులెన్స్‌ను తీసుకురావాలంటే జంకుతున్నారు



మర్కల్-తిర్మన్‌పల్లి గ్రామాలకు అత్యవసరంగా అంబులెన్స్ తీసుకురావాలంటే సిబ్బంది జంకుతున్నారు. రోడ్డుపై వాహనం రావడం కష్టంగా ఉంటోంది. గత కొన్ని సంవత్సరాలుగా అతుకులు వేసి చేతులు దులుపుకుంటున్నారు. పట్టించుకునే నాథుడు లేదు.

–నర్సారెడ్డి, మర్కల్

కాంట్రాక్టర్‌లు ముందుకు రావడం లేదు

మర్కల్-తిర్మన్‌పల్లి బీటీ రోడ్డు రెన్యూవల్ కోసం ఎంఆర్ఆర్ కింద రూ.కోటి 20లక్షలు మంజూరు అయ్యాయి. పనులు చేయడానికి ఏ కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. చాలా సార్లు పిలిచిన ఆసక్తి చూపడం లేదు. కాంట్రాక్టర్‌లు ముందుకు వస్తే పనులు త్వరితగతిన ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తాం.

–సురేశ్, ఏఈ, పీఆర్,సదాశివనగర్



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో ఆదివారం 2005–06 పదోతరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. 20 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు శోభన్‌బాబు, సాయిలు, సంధ్యారాణి, ఎంఈవో చంద్రసింగ్, విద్యార్థులు నరేష్‌గౌడ్, జ్యోతి, శిల్ప, ఆనంద్, సాయికుమార్,సలీమ్, వేణు, రవి, ఫకీరా నాయక్ ఉన్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం



మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు రాజిరెడ్డి

రాజంపేట : ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతుకు ఏదో ఒక రూపంలో కష్టాలు తప్పడం లేదు. రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామంలోని రాజిరెడ్డి అనే రైతు తనకున్న రెండు ఎకరాల భూమిలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు. శనివారం రాత్రి అడవి పందులు మొక్కజొన్న పంటపై దాడి చేసి బీభత్సాన్ని సృష్టించాయి. దీంతో మొక్కజొన్న పంట మొత్తం నేలవాలింది. అడవి పందులు రాకుండా ఎన్ని ప్రయత్నాలు చేసిన వాటి దాడుల నుంచి పంటను కాపాడుకోలేకపోతున్నామని బోరున విలపిస్తున్నారు.

కొనసాగుతున్న గుజ్జుల్ డ్యాం తూము గండికి మరమ్మతులు



గండిని పూడ్చుతున్న అధికారులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుజ్జుల్ డ్యాం ఎడమ కాలు తూముకు గండి పడి నీరు వృథాగా పోతున్న విషయం తెలిసిందే. నీటి పారుదల శాఖ అధికారులు రెండు రోజులుగా తూము గండిని పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆదివారం కూడ మరమ్మతు పనులు కొనసాగాయి. ఆయకట్టు పొలాల్లో నీరు చేరి పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆధ్యాత్మికం

గణనాథుడి కిరీటం కోసం వెండి విరాళం



బాన్సువాడ : పట్టణంలోని పాత బాన్సువాడ వినాయక నగర్‌లో గల వరసిద్ధి వినాయక మందిరం గణనాథుడి కిరీటం కోసం 600 గ్రాముల వెండిని దాత దొన్కంటి సుజాత- సాయిలు అందజేశారు. సాయిలు దంపతులకు పూర్తి ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రసాదించాలని ఆలయ కమిటీ సభ్యులు వినాయకుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దొన్కంటి రాములు, విఠల్, సునీత తదితరులున్నారు.

గైపీర్లు అత్యంత పవిత్రమైనవి



బాన్సువాడ : బీర్కూర్ మంజీర సమీపంలో ఉన్న గైపీర్లు అత్యంత పవిత్రమైనవని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. ఆదివారం బీర్కూర్‌లో నిర్వహించిన గైపీర్ల సవారీకి ఆయన హాజరై మాట్లాడారు. పురాతన గైపీర్లు భక్తుల కొర్కేలు తీరుస్తున్నాయని అన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యామ రాములు, రఘు, మన్నన్, శశికాంత్, విజయప్రకాష్, అజాద్ తదితరులున్నారు.

భక్తులకు పండ్ల పంపిణీ



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని జాతీయ రహదారి బ్రిడ్జి సర్వీస్ రోడ్డు మీదుగా ఆదివారం దిండిగా వెళ్తున్న భజన భక్తులకు పండ్లు, నీళ్లను ఎస్సై అరుణ్ కుమార్ పంపిణీ చేశారు. జుక్కల్ మండలంలోని లాడేగావ్ గ్రామం నుంచి దిండిగా భక్తులు చిన్నకొడప్‌గల్ రామేశ్వరం గుట్టకు బయలుదేరారు. ఈక్రమంలో భక్తులు పెద్దకొడప్‌గల్ మీదుగా బేగంపూర్ చౌరస్తా హనుమాన్ ఆలయానికి చేరుకొని నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి శ్రావణమాసంలో మారుతి మహరాజ్ ప్రారంభించగా ఇప్పటికీ ఆనవాయితీని భక్తులు కొనసాగిస్తున్నారు.

సమాచారం..

నేడు రేషన్ కార్డుల పంపిణీ

బిచ్కుంద/మద్నూర్(జుక్కల్): బిచ్కుంద, మద్నూర్ మండలాల్లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు చేతుల మీదుగా అందించనున్నట్లు తహసీల్దార్లు వేణుగోపాల్, ముజీబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి హాజరుకానున్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి విద్యుత్‌శాఖ సబ్‌డివిజన్ పరిధిలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, వినియోగదారులు తమ సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. వినియోగదారులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

సంక్షిప్తం

చలో వరంగల్‌ను విజయవంతం చేయండి

బాన్సువాడ రూరల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర మలిదశ ఉద్యమ కారుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం వరంగల్‌లో నిర్వహించే మహా పాదయాత్రను విజయవంతం చేయాలని ఫోరం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉడుత గంగాధర్ కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20నెలలు పూర్తికావస్తున్నా నేటికి మలిదశ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోలేకపోవడం బాధకరమన్నారు. ఆయన వెంట ప్రధాన కార్యదర్శి గంజివార్ చందు ఉన్నారు.

ఆర్టీసీ టూర్ ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలి

బాన్సువాడ రూరల్: ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలకు నిర్వహిస్తున్న ప్రత్యేక టూర్ ప్యాకేజీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ సరితదేవి కోరారు. ఈనెల 13న బాన్సువాడ నుంచి ఉదయం 5:30 గంటలకు చిలుకూరి బాలాజీ మందిర దర్శనం, అనంతగిరి హిల్స్, పద్మనాభస్వామి ఆలయ దర్శనాలకు బస్సు బయలు దేరుతుందన్నారు. తిరిగి అదేరోజు రాత్రి 12గంటలకు బాన్సువాడ చేరుకుంటుందన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.500 ఉంటుందన్నారు. తక్కువ ఖర్చుతో పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలకు వెళ్లాలనుకునే వారు ఆర్టీసీ టూర్‌ప్యాకేజీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టికెట్ రిజర్వేషన్లకు గోపీకృష్ణ 9063408477 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

అందుబాటులో యూరియా

మాచారెడ్డి: మండల కేంద్రంలోని సింగిల్ విండోలో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి పవన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం యూరియాకు ఎలాంటి కొరత లేదని పేర్కొన్నారు. యూరియా కావాల్సిన వారు దగ్గరలోని కేంద్రాల్లో తీసుకోవాలని సూచించారు.

పెన్షనర్ల మహాధర్నాకు డీటీఎఫ్ మద్దతు

కామారెడ్డి అర్బన్/సదాశివనగర్ : తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాకు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవులా, ఎన్‌సీ ప్రభాకర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్‌దారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ ఎత్తున తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.

నులిపురుగు నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



వైద్యురాలు రాంబాయి

లింగంపేట(ఎల్లారెడ్డి): జాతీయ నులి పురుగు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని లింగంపేట పీహెచ్‌సీ వైద్యురాలు రాంబాయి అన్నారు. ఆదివారం ఆమె లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివరాలు వెల్లడించారు. మొదటి సంవత్సరం నుంచి 19 సంవత్సరాల పిల్లలకు సోమవారం నుంచి అల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. పాఠశాలకు రాని విద్యార్థులకు 18వ తేదీన మాత్రలు వేయాలని సూచించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి టీచర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఘనంగా బారడి పోచమ్మ తల్లి బోనాలు



పోచమ్మ ఆలయంలో పూజలు చేసిన సింధే

పిట్లం(జుక్కల్): మండలకేంద్రంలో బారడి పోచమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వర ఆలయం నుంచి మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని, డీజే చప్పుళ్లు, పోతరాజుల నృత్యాల మధ్య ఊరేగింపుగా గ్రామ శివారులోని బారడి పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే హనుమంత్ సింధే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తుల ప్రదర్శన ఆకట్టుకుంది.

బురుజుపై పిచ్చి మొక్కలు

- బీటలు వారుతున్న కోట

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని ఉత్తునూర్‌లో పురాతన కాలం నాటి బురుజు కోట నిర్లక్ష్యానికి గురవుతుంది. బురుజుపై పిచ్చి మొక్కలు పెరగడంతో కోట పూర్తిగా బీటలు వారింది. అక్కడక్కడ కూలిపోతుంది. పురాతన కట్టడాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికి సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యంతో బురుజు నిర్లక్ష్యానికి గురవుతోంది. బురుజుపై పెరిగిన పిచ్చి మొక్కలను చూసి పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



ఉత్తునూర్‌లో బురుజు కోటపై పెరిగిన మొక్కలు

శిథిల భవనాలు తొలగించరూ..



బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో దశాబ్దాల క్రితం నిర్మించిన తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. దీంతో వాటిని క్లాసుల నిర్వాహణకు ఉపయోగించడం లేదు. ఇంటర్వెల్, ఆటల పిరియడ్ సమయంలో చిన్నారులు శిథిలభవనాల వద్ద ఆడుకుంటున్నారు. కురుస్తున్న వర్షాలతో గదులు కూలితే విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు అప్రమత్తమై తిర్మలాపూర్‌తో పాటు మండలంలోని అన్నిపాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న గదులను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కుక్కలతో ఇబ్బందులు



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని పోచమ్మ గల్లీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో కుక్కల గుంపు సంచరిస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో కుక్కలు, పందులు పాఠశాలలోకి వస్తున్నాయని వారు వాపోతున్నారు. ఇటీవల కుక్కల గుంపు పలువురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని వారు కోరుతున్నారు.

అధ్వానంగా దేవాయిపల్లి–బ్రాహ్మణపల్లి రోడ్డు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి దేవాయిపల్లి మీదుగా బ్రాహ్మణపల్లి వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం కాంట్రాక్టర్ నాసిరకంగా తారు వేయడంతో రోడ్డు గుంతలమయంగా తయారైందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మధ్యలో నిర్మించిన కల్వర్టు కూడా పూర్తిగా ధ్వంసమైంది. ఈరోడ్డు మార్గంలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి వాహనదారులు గాయపడ్డ సందర్భాలున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



గుంతలతో ఉన్న రోడ్డు


నూతన కార్యవర్గాల ఎన్నిక

మున్నూరుకాపు సేవాసమితి ..



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్నూరుకాపు సేవా సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం భవనంలో సంఘం సీనియర్ ప్రతినిధి బొజ్జ రవీందర్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా హన్మాండ్ల రమేష్, ప్రధాన కార్యదర్శిగా తోట క్రాంతి, కోశాధికారిగా తోట రాజేష్, గౌరవ అధ్యక్షుడిగా హన్మాండ్ల సురేష్, సలహాదారులుగా రవీందర్, గోపికృష్ణ, సుదర్శన్ లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, వంశీకృష్ణ,, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ..



కామారెడ్డి అర్బన్: గంగపుత్ర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.రాజన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షులుగా పాక వెంకటి, ఉపాధ్యక్షులుగా ఎం.పోచయ్య, సి.గంగాకిషన్, కేపీ అనిల్‌కుమార్, బి.రమేష్, పి.సునీత, ప్రధాన కార్యదర్శిగా ఎ.శంకర్, సంయుక్త కార్యదర్శిగా ఏ.ఎల్లేషం, ఎన్.నరేష్, యు.శృతి, కోశాధికారిగా డి.ప్రవీణ్‌కుమార్ , కార్యనిర్వహణ కార్యదర్శిగా జి.గిర్మబోయి, డి.గణేష్, కే.శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు. సమావేశంలో వివిధ శాఖల్లో ప్రమోషన్లు పొందిన ఉద్యోగులను సన్మానించారు. సామాజిక సేవా కార్యక్రమాలకు తమవంతుగా సహకారం అందించాలని తీర్మానించారు.

సింగిల్‌విండో ఉద్యోగుల సంఘం ..



నిజాంసాగర్/భిక్కనూరు: కామారెడ్డి జిల్లా సింగిల్‌విండో ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని కామారెడ్డి పట్టణంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భిక్కనూరు మండలం అంతంపల్లి సింగిల్‌విండో కార్యదర్శి శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా అచ్చంపేట సింగిల్‌విండో కార్యదర్శి సంగమేశ్వర్‌గౌడ్, కోశాధికారిగా పెద్దమల్లారెడ్డి సింగిల్‌విండో కార్యదర్శి మోహన్‌గౌడ్, మహిళ ప్రతినిధిగా బస్వాపూర్ సింగిల్‌విండో కార్యదర్శి మహేశ్వరిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్ మాట్లాడుతూ సింగిల్‌విండో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానన్నారు.